సాక్షి
నారాయణపేట

గురువారం । 25 । జూలై । 2024



జూరాలకు తగ్గని వరద

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు 1.80 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.

వివరాలు 8లో ▸



..క్రీడాకారులను అందిస్తాం

దేశానికి మంచి క్రీడాకారులను అందిస్తామని శాట్ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 27.2 /24.3

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అప్పుడప్పుడు ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

భట్టి పద్దుపైనే ఆశలు

నేడు రాష్ట్ర బడ్జెట్.. నిధుల కోసం ఎదురుచూపు

- సాగునీటి ప్రాజెక్టులు, పెండింగ్ పనులకు నిధుల కొరత
- ఏళ్లుగా పెండింగ్‌లోనే పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల
- నిధులు కేటాయిస్తేనే పర్యాటకానికి ఊతం
- సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో బడ్జెట్‌పై నెలకొన్న ఆశలు

సాక్షి, నాగర్‌కర్నూల్: రాష్ట్ర శాసనసభ వేదికగా ఉపముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క గురువారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. మంగళవారం నాటి కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ఉమ్మడి పాలమూరు జిల్లాకు కేటాయింపులు దక్కక పోగా, ఇప్పుడు ఆశలన్నీ రాష్ట్ర బడ్జెట్‌పైనే నెలకొన్నాయి. ఉమ్మడి జిల్లాలో చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈసారి రాష్ట్ర బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులు కేటాయిస్తేనే పనులు ముందుకుసాగే అవకాశం ఉంది. పర్యాటకంగా విస్తృత అవకాశాలు ఉన్న జిల్లాలో నిధుల కొరతే ప్రధాన అడ్డంకిగా ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాకు అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తుందన్న అంచనాలు నెలకొన్నాయి.

'పాలమూరు' ముందుకు సాగేనా?

ఉమ్మడి పాలమూరు జిల్లాతో పాటు రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో సుమారు 12.50 లక్షల ఎకరాల్లో సాగునీరు అందించేందుకు చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేసేందుకు నిధుల కొరతే ఇబ్బందిగా మారింది. ఇప్పటివరకు కొంతమేర రిజర్వాయర్లు, టన్నెళ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ కీలకమైన మోటార్ల బిగింపు, కాల్వల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఈ ప్రాజెక్టు కోసం కేంద్రం నుంచి నిధులు లభిస్తాయని ఆశించినా తాజా బడ్జెట్‌లో నిరాశే ఎదురైంది. ఇప్పుడు ఆశలన్నీ రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌పైనే కేంద్రీకృతమై ఉన్నాయి. ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్ష సమావేశంలో 2024లోగా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అయితే ఈమేరకు అవసరమైన నిధులను మంజూరు చేయాల్సి ఉంది.

'పాలమూరు'కు పూర్తినిధులు ఇవ్వాలి..



రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుతో పాటు మిగిలిన ప్రాజెక్టులకు అవసరమైన నిధులు మంజూరు చేయాలి. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేయాలి. ప్రాజెక్టుల నిర్మాణంలో కాల్వలు పూర్తయ్యి రైతుల పొలాల్లోకి నీరు చేరేవరకు పనులు జరగాలి. ఈసారి బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 20 శాతానికి మించి ఖర్చుచేయాలి.

– రాఘవాచారి, కన్వీనర్, పాలమూరు అధ్యయన వేదిక

నిధులు ఇస్తేనే పర్యాటకాభివృద్ధి..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రధానంగా నల్లమల అటవీప్రాంతం, అమ్రాబాద్ పులుల అభయారణ్యం, కృష్ణానది తీర ప్రాంతాల్లోని ప్రకృతి రమణీయ ప్రదేశాలు పర్యాటకాభివృద్ధికి అనుకూలంగా ఉన్నాయి. ప్రభుత్వం ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని చెబుతుండగా ఇందుకు నిధులే కీలకం కానున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 49 ప్రధాన ఆలయాలు దేవాదాయ శాఖ అధీనంలో ఉన్నాయి. వీటిలో ప్రధానంగా జోగుళాంబ శక్తిపీఠం, మన్యంకొండ, కురుమూర్తిస్వామి, ఉమామహేశ్వరం, మద్దిమడుగు, సోమశిల తదితర ఆలయాల్లో వసతులను మెరుగుపర్చాల్సి ఉంది. ప్రధాన ఆలయాలతో పాటు టెంపుల్ టూరిజం అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాల్సి ఉంది.



పెండింగ్‌లోనే ప్రధాన ప్రాజెక్టులు..

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుతో పాటు కల్వకుర్తి ఎత్తిపోతల పథకం సైతం పూర్తిస్థాయి సామర్థ్యం మేరకు పనులు పూర్తికాలేదు. కేఎల్‌ఐ కింద సుమారు 4.50 లక్షల ఎకరాలకు నీరందించాలని లక్ష్యంగా పెట్టుకున్నా ఈ ప్రాజెక్టు ఆయకట్టు 2లక్షల ఎకరాలకే పరిమితమైంది. ఇంకా 28 ప్యాకేజీ విస్తరణతో పాటు 29, 30 ప్యాకేజీల పనులను పూర్తి చేయాల్సి ఉంది.

■ గద్వాల, అలంపూర్ పరిధిలో సుమారు 2 లక్షల ఎకరాలకు నీరందించేందుకు చేపట్టిన నెట్టెంపాడు ప్రాజెక్టు సైతం అసంపూర్తిగానే ఉంది. ఈ ప్రాజెక్టు కింద ప్రస్తుతం 1.42 లక్షల ఎకరాలకు మాత్రమే నీరందుతోంది. ఇంకా 58 వేల ఎకరాలకు నీరందించే పనులు చేపట్టాల్సి ఉంది. ప్రధానంగా పెండింగ్‌లో ఉన్న 99బీ, 99సీ, 99డీ, 100 ప్యాకేజీలను పూర్తిచేసేందుకు రూ. 231.36 కోట్లు అవసరం కానున్నాయి.

■ రూ.581 కోట్ల వ్యయ అంచనాలతో ప్రారంభించిన గట్టు ఎత్తిపోతల పథకం సైతం ఇప్పటి వరకు 40శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా సుమారు రూ. 285.19 కోట్ల పనులు చేపట్టాల్సి ఉంది. ఆర్డీఎస్ ప్రాజెక్టు కింద తుంగభద్ర నది నుంచి నీటిని ఎత్తిపోసి 87,500 ఎకరాలకు నీరందించేందుకు తుమ్మిళ్ల లిఫ్టు పనులను 8 ఏళ్ల కిందట ప్రారంభించగా, ఈ పనులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి.

■ కోయిల్‌సాగర్ కుడి, ఎడమ కాల్వల మరమ్మతులు, డిస్ట్రిబ్యూషన్ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ఇంకా సుమారు రూ. 89.9 కోట్ల పనులు చేపట్టాల్సి ఉంది. కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకం కింద నాగిరెడ్డిపల్లి, తీలేరు వద్ద పంప్‌హౌస్‌లను నిర్మించాల్సి ఉంది. కోయిల్‌సాగర్ బ్యాక్‌వాటర్ నుంచి దేవరకద్ర గ్రావిటీ కెనాల్ పనులు చౌదరిపల్లి నుంచి లక్ష్మింపల్లి వరకు కాల్వ పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

■ సంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్ పనులు పూర్తయినా కాల్వల నిర్మాణం పూర్తికాకపోవడంతో లక్ష్యం నెరవేరడం లేదు.డిస్ట్రిబ్యూటరీ కెనాల్, కాల్వలు పూర్తయితేనే ఆయకట్టు రైతులకు సాగునీరు అందనుంది.

ఇప్పటికే కొడంగల్ ఎత్తిపోతలకు నిధులు..

కొడంగల్ ఎమ్మెల్యేగా ఉన్న రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక ప్రధానంగా కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకంపై దృష్టిసారించారు. ఈ పథకానికి ఇప్పటికే రూ.2,945 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఇప్పటికే మూడు దశల్లో సర్వే పనులు పూర్తికాగా, త్వరలోనే ప్రాజెక్టు డీపీఆర్‌ను అధికారులు సిద్ధం చేయనున్నారు. నిధులు సైతం మంజూరుకావడంతో ఈ ప్రాజెక్టు పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి.

న్యూస్‌రీల్

మెడికల్ కళాశాలలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు

నారాయణపేట: జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులకు అర్హులైన వైద్యులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాంకిషన్ కోరారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆధ్వర్యంలో జరిగే ఈ నియామకాలకు డాక్టర్లు నేరుగా తమ సర్టిఫికెట్లతో గురువారం నుంచి ఆగస్టు 3వ తేది వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అప్పక్‌పల్లిలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలలో హాజరు కావాలని కోరారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో గౌరవ వేతనంతో కూడిన కాంట్రాక్ట్ ప్రతిపాదికన వివిధ స్పెషాలిటీలకు సంబంధించన ప్రొఫెసర్లు 14, అసోసియేట్ ప్రొఫెసర్లు 18, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 46, సీనియర్ రెసిడెండ్లు 21, ట్యూటర్ 15 పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు , సీనియర్ రెసిడెంట్ పోస్టుకు ఎండీ, ఎంఎస్, పీజీ డిగ్రీలో సాధించిన మార్కులు, ట్యూటర్ పోస్టులకు ఎంబీబీఎస్‌లో సాధించిన మార్కులు పరిగణలోకి తీసుఉంటామని తెలిపారు. దరఖాస్తుతో పాటు ఒరిజినల్ అకాడమిక్ సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, రెండు సెట్లు, అకాడమిక్ సర్టిఫికెట్ల ఫొటో కాపీలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఇసుక అక్రమ తవ్వకాలు జరిపితే చర్యలు



మాగనూర్: ఇసుక అక్రమ తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు అడిషనల్ కలెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక తహసీల్దార్‌తో కలిసి కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో ఇసుక రీచ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉన్న సమయంలో ఇసుక రీచ్‌లు నడిచేవని అయితే నూతన కలెక్టర్ జిల్లాకు రావడంతో వారికి ఇక్కడ అనుమతులతో నడుస్తున్న ఇసుక రీచ్‌లపై అవగాహన కోసం పరిశీలించామని తెలిపారు. గత 20 రోజులుగా మండల వ్యాప్తంగా కేవలం ఆన్‌లైన్ అనుమతులతో మాత్రమే ఇసుక తరలింపు జరుగుతుందని అన్నారు. ఎక్కడ కూడా ఆఫ్‌లైన్, బోజు(సన్నరకం)ఇసుక అనుమతులు లేవని గుర్తుచేశారు. అనుమతులు పొందిన పరిధిలోనే మాన్యువల్‌గా ఇసుక తవ్వకాలు జరిగేలా మైనింగ్‌శాఖ అధికారులతో పాటు పోలీసు, రెవెన్యూ, శాండ్ కమిటీ, ఇతర శాఖల అధికారులు పర్యవేక్షణ మధ్య జరుగుతుందన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలు జరిగినట్లు గుర్తించితే వెంటనే పోలీసు అధికారులు వారిపై కేసుననమోదు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సతీష్‌కుమార్, ఆర్‌ఐ శ్రీశైలం ఉన్నారు.

నేడు నారాయణపేట కమిషనర్‌తో 'సాక్షి' ఫోన్ ఇన్

సాక్షి ఫోన్ ఇన్



ప్రస్తుత వానాకాలంలో డెంగీ, మలేరియా తదితర సీజనల్ **వ్యాధులు ప్రబలే అవ**కాశం ఉన్న నేపథ్యంలో గురువారం **నారాయణపేట ము**న్సిపల్ కమిషనర్ సునీతతో 'సాక్షి' **ఫోన్ ఇన్ కార్యక్రమ**ం నిర్వహిస్తోంది. మున్సిపాలిటీలో **సీజనల్ వ్యాధుల** నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్ర**త్తలు, పారిశుద్ధ్య చర్య**లపై ప్రజలు సలహాలు, సూచనలు **ఇవ్వవచ్చు. అలాగే** ఓపెన్ ప్లాట్లు, ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం నిండిపోవడం, డ్రెయినేజీ, రోడ్లు సరిగా లేకపోవడం తదితర సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకురావచ్చు.

సునీత, మున్సిపల్ కమిషనర్,

తేదీ : 25.7.2024 సమయం : ఉదయం 11 నుంచి 12 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్ : 9618099288

వన మహోత్సవ లక్ష్యాన్ని పూర్తి చేయాలి



దామరగిద్దలో మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్.

- ఎంపీడీఓలు, అధికారులదే బాధ్యత
- కలెక్టర్ సిక్తా పట్నాయక్
- ఊట్కూర్, దామరగిద్దలో పర్యటన

నారాయణపేట: వన మహోత్సవం కార్యక్రమ లక్ష్యాన్ని వంద శాతం పూర్తి చేసేందుకు ఎంపీడీవోలు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, డీపీఎం, ఏపీఎంలు.. అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్‌తో కలిసి కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతి మండలంలో నిర్దేశించిన లక్ష్యం ప్రకారం మొక్కలు నాటాలని ఆదేశించారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఏపీఎంలు మహిళ శక్తి క్యాంటిన్‌లను ఏర్పాటు చేసేందుకు గుర్తించి వాటి ఇంప్లిమెంట్ గ్రౌండ్ కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. పౌల్ట్రీ తదితర వాటికి శిక్షణ ఇప్పించాలన్నారు. షెడ్యూల్ ప్రకారం పని చేయాలన్నారు. మీ సేవల ఏర్పాటుపై ఆరా తీశారు. అదేవిధంగా అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ మాట్లాడుతూ 100 శాతం మొక్కలు నాటి జియో ట్యాగింగ్ చేయాలన్నారు. ఈ రిపోర్ట్ అలసత్వంపై అదనపు కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎఫ్‌టిఓ పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా ప్రజాపాలన దరఖాస్తుల పరిష్కారంపై ఆరా తీశారు. ట్రైని కలెక్టర్ గారిమా నరుల, డీఆర్‌డీఏ రాజేశ్వరి, అంజయ్య, మున్సిపల్ కమిషనర్లు ఎంపిడిఓలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాల వైపు నడవాలి

ఊట్కూరు: విద్యార్థులు ఉన్నత లక్ష్యాల వైపు నడవాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. బుధవారం ఊట్కూరులోని బాలుర ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఉర్దూ మీడియంలో ప్రతి తరగతిలో ముగ్గురు విద్యార్థుల చొప్పున గైరాజరు కావడంపై అసహనం వ్యక్తం చేస్తూ.. వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి వచ్చేవిదంగా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలో తరగతి గదుల కొరత ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. పాఠశాలలో సమస్యలు, పరిష్కార మార్గాలను చూపుతూ ఒక నివేదిక తయారుచేసి తనకు అందించాలని డీఈఓకు ఆదేశించారు. 10వ తరగతి విద్యార్థులకు యాక్షన్ ప్లాన్ తయారు చేసి వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. డీఈఓ అబ్దుల్ ఘని, తహసీల్దార్ మమత, హెచ్‌ఎం కుసుమ తదితరులు పాల్గొన్నారు.

స్వావలంబన దిశగా ముందుకు సాగాలి..

దామరగిద్ద: మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా వివిధ స్వయం సమృద్ధి పథకాలను అమలు చేస్తుందని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మహిళ సమాఖ్య సమావేశానికి కలెక్టర్ హాజరయ్యారు. ఆధునిక టెక్నాలజీతో తక్కువ పెట్టుబడి, తక్కువ శ్రమతో మహిళలు ఎక్కుల లాభాలు పొందెలా ప్రభుత్వం వివిధ స్వయం సమృద్ధి కేంద్రాల నిర్వహణకు శిక్షణ అందిస్తుందన్నారు. సమాఖ్య అందించే బ్యాంకు రుణాల ద్వారా ఎలాంటి ఉపాది కార్యక్రమాలు చేపట్టారని అడిగి తెలుసుకున్నారు. మహిళ శక్తి క్యాంటీలను మండల కేంద్రాల్లో ఏర్పాటు చేయాలన్నారు. సొంత భవనాలు లేని సమాఖ్య తీర్మాణాలను అందిస్తే ప్రభుత్వానికి నివేదిస్తానని తెలిపారు. డీఆర్‌డిఓ రాజేశ్వరి, అడిషనల్ డీఆర్‌డీఓ అంజయ్య, తహసీల్దార్ జయరాములు పాల్గొన్నారు.



ఊట్కూరు పాఠశాలలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

విద్యార్థుల్లో నైతికత పెంపొందించేలా శిక్షా సప్తాహ్ నిర్వహణ

- పాఠశాలల్లో ఈ నెల 22 నుంచి 29 వరకు కార్యక్రమాలు
- 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఆట, పాటల ద్వారా అవగాహన



మొగుల్మడక జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు తయారు చేసిన వంశ వృక్ష చార్ట్

నర్వ: ప్రభుత్వ బడుల బలోపేతంతో పాటు వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు సర్కారు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం అమల్లోకి తెచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా పిల్లల్లో విజ్ఞానం, వినోదం పెంచేందుకు "శిక్షా సప్తాహ్" పేరిట ఈ నెల 22 నుంచి 29 వరకు విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు కార్యాచరణ రూపొందించారు. రోజుకు ఒక్కో అంశం చొప్పున క్రీడలు, సాంస్కృతిక ప్రదర్శనలు, మొక్కల పెంపకం, చారిత్రక కట్టడాలు, పోషకాహారంపై అవగాహన కల్పించనున్నారు. ఈ మేరకు సమగ్ర శిక్షా అభియాన్ ఆదేశాలు జారీ చేసింది.

వినోదం.. విజ్ఞానం..

జిల్లాలో వివరాలిలా..

మండలం	విద్యార్థుల సంఖ్య
నారాయణపేట	7,518
మక్తల్	7,202
దామరగిద్ద	5,306
ఊట్కూర్	5,062
మద్దూర్	4,720
ధన్వాడ	4,285
కోస్గి	4,243
నర్వ	3,303
మాగనూర్	2,867
కృష్ణ	2,769
మరికల్	2,765
కొత్తపల్లి	1,299



ఎక్లస్‌పూర్ పాఠశాల విద్యార్థుల చిత్రలేఖనం

మొదటి రోజు నీటి వృథా అరికట్టేలా..

నీటి ఆదాపై విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పించడంతో వృథా అరికట్టగలుగుతారు. ఇతరులకు ఎలా సాయం చేయాలో తెలిపే నినాదాలు, ప్లకార్డులతో అవగాహనతో పాటు ఆహారం కూరగాయాలు అంశంపై కథలు, వ్యాసాలు రాయించారు. వ్యర్థాలతో బొమ్మల తయారు చేయించారు.

బోధనోపకరణాల ప్రదర్శన..

పాఠశాలల్లో అమలు చేస్తున్న ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమానికి సంబందించి ఉపాధ్యాయులు బోధన పద్ధతులు ఉపకరణాలు ప్రదర్శించారు. వీటి ద్వారా బోధన చేయడంతో సులభంగా విద్యార్థులు సులువుగా అర్థం చేసుకున్నారు.

అట్టహాసంగా క్రీడాదినోత్సవం

విద్యార్థులకు దేశీయ క్రీడలు నిర్వహించారు. ఆటల వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. దీని వల్ల మానసికంగా, శారీరకంగా ఎలా ఉల్లాసంగా ఉంటామో వివరించారు. ఆయా పాఠశాలల్లో క్రీడా పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు.

25న (నేడు) సాంస్కృతిక దినోత్సవం..

సాంస్కృతిక దినోత్సవం నిర్వహించి విద్యార్థులతో వివిధ వేషధారణ చేయించాలి. వివిధ భాషలు ప్రాంతాల్లోని సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన కల్పించాలి. చిత్రలేఖన జానపద నృత్యాలు, నాటికలు, వేయించి వీరిలో ఉత్సాహం నింపాలి.

26న సాంకేతిక నైపుణ్యాల దినం..

సాంకేతిక నైపుణ్యాల దినోత్సవంలో బాగంగా కోడింగ్, డీకోడింగ్ చాలెంజ్ జీవావరణ కార్యక్రమాలు నిర్వహించాలి. వృక్షజాలం, జంతుజాలం ,పై అవహన కల్పించాలి. చారిత్రక స్థలాల సందర్శన తదితర వర్క్‌షాపులు నిర్వహించాలి.

27న పోషకాహారంపై..

పోషకాహార దినోత్సవం నిర్వహించి విద్యార్థుతో ఎకోక్లబ్‌లు ఏర్పాటు చేసి మొక్కల పెంపకం కూరగాయాల తోటల పెంపకంపై అవగాహన కల్పించాలి. వీటిని పాఠశాలలో ఏర్పాటు చేసే విధంగా చూడాలి.

29న సామాజిక భాగస్వామ్యం..


సామాజిక భాగస్వామ్యం రోజు పాఠశాల అభివృద్ధిలో అందర్ని బాగస్వామ్యులు చేయాలి.

శిక్షా సప్తాహ్‌తో ఎంతో ప్రయోజనకరం



జాతీయ విద్యావిధానంలో భాగంగా వారం రోజుల పాటు చేపట్టిన శిక్షా సప్తాహ్ కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరం. వారం రోజుల పాటు పాఠశాలల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించడంతో విద్యార్థుల్లో సామాజిక చైతన్య పెరుగుతుంది. నాయకత్వ, లక్షణాలు అలవాటుపడటంతో పాటు పోషకాహారం తీసుకోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, ఇతరులకు సాయపడటం తదితర అలవాట్లు పెరుగుతాయి.

– విద్యాసాగర్, ఏఎంఓ, నారాయణపేట



ధన్వాడ పాఠశాలలో విద్యార్థులు తయారు చేస్తున్న ప్రయోగాలు

విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి



భీంపూర్ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్

మద్దూరు: ఉపాధ్యాయులు.. విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని, ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అడిషనల్‌కలెక్టర్ మయాంక్ మిట్టల్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని భీంపూర్ ప్రాథమిక పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రం, గ్రామ పంచాయతీ కార్యాలయం, కమ్యూనిటీ ప్లాంటేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ఇప్పటి వరకు జరిగిన బోధనపై ప్రశ్నలు వేయడంతో విద్యార్థుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఉపాధ్యాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలో కనీస విద్యను అందించకపోతే ఎలా అని ప్రశ్నించారు. విద్యార్థులకు అదనపు కలెక్టర్ పాఠాలు బోధించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, ప్రీస్కూల్ బోధనను పరిశీలించారు. నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. గ్రామ పంచాయతీ కార్యలయం అవరణలో, గ్రామంలో అపరిశుభ్రంగా ఉన్న వీధులను పరిశీలించి పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పంచాయతీ రిజిస్టర్లను పరిశీలించారు. ఎప్పటికప్పుడు రికార్డులను అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. కమ్యూనిటి ప్లాంటేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జయరాములు, ఎంపీఓ రామన్న, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి

నారాయణపేట రూరల్: పీఎస్‌లలో నమోదైన ప్రతీ కేసును క్షుణంగా పరిశీలించి వేగంగా పరిష్కరించేందుకు ఎస్‌హెచ్‌ఓలు కృషిచేయాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ సూచించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని సీఐ, ఎస్‌లతో మంగళవారం నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, ఆలస్యానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులను పరిశీలించారు. యూఐ టార్గెట్ కేసులను తగ్గించేందుకు యాక్షన్‌ప్లాన్‌పై తగు సూచనలు చేశారు. కేసుకు సంబందించిన ప్రతి ఆధారాన్ని సంపాదించి, నేరస్తులకు కోర్టు ద్వారా తగిన శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కేసులకు సంబందించి ప్రతీది ఆన్‌లైన్ చేయాలని, నేరాల కట్టడికి అవసరమైన నివారణ చర్యలు చేపట్టాలన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా యువత, గ్రామీణ ప్రజలకు తగిన అవగాహన కల్పించాలని, డయల్ 100 ఫిర్యాదులను వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. పెట్రోలింగ్ విషయంలో నిర్లక్ష్యం లేకుండా చూడాలని, నిషేధిత వస్తువుల విక్రయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. 5ఎస్ అమలుకు తగిన సూచనలు చేస్తూ పీఎస్ పరిశుభ్రత, ఫైల్స్ క్రమ పద్దతిలో ఏర్పాటు చేసే విధంగా కిందిస్థాయి సిబ్బందికి సూచనలు చేయాలన్నారు. పీఎస్‌కు వచ్చే బాదితులకు భయం పోగొట్టి బరోసా అందించాలని, ప్రతి ఒక్కరితో మర్యాదగా నడుచుకోవాలన్నారు. సమావేశంలో డీఎస్పీలు లింగయ్య, సీఐలు ఎస్‌ఐలు, కోర్టుడ్యూటీ ఆఫీసర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

క్లుప్తంగా

గ్యాస్ లీకేజీ ఘటనలో దంపతుల మృతి

గోపాల్‌పేట: మండలంలోని మున్ననూరులో ఇటీవల గ్యాస్ లీకేజీ రిపేరు చేస్తుండగా మంటలు చెలరేగిన ఘటనలో దంపతులు మృతి చెందారు. మంగళవారం సోడె వెంకటయ్య (55) హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా, బుధవారం ఆయన భార్య చిట్టెమ్మ (45) మరణించింది. ఈ విషయంపై కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ చంద్రయ్య తెలిపిన వివరాలిలా.. పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన సమీర్ సేతి (42) జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న యాగంలో లైటింట్ పనులు చేసేందుకు వచ్చాడు. ఇతడు ఈనెల 23న మద్యం సేవించి జిల్లా కేంద్రంలో బొలెరో వాహనం ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. తోటి కార్మికులు గమనించి చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

గుట్కా పాకెట్లు స్వాధీనం

రాజాపూర్: మండలంలోని ముదిరెడ్డిపల్లిలో బుధవారం పోలీసులు దుకాణాల్లో దాడులు నిర్వహించి నిషేధిత గుట్కా పాకెట్లు, పాన్ మసాలాలను స్వాధీనం చేసుకున్నారు. గుట్కా విక్రయిస్తున్న బొడ్డుపల్లి పాండుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం

నవాబుపేట: మండల కేంద్రానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థిని వర్షిత(20) అదృశ్యమైంది. జిల్లా కేంద్రంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆమె.. ఈ నెల 22న ఎప్పటి మాదిరిగా కళాశాలకు వెళ్లింది కానీ ఇంటికి తిరిగిరాలేదు. ఆమె తల్లిదండ్రులు ఆచూకీ కోసం వెతికినా ఫలితం లభించలేదు. దీంతో బుధవారం ఆమె తల్లి శివలీల ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. కాగా అదృశ్యం వెనుక వీర్‌శెట్టిపల్లికి అరవింద్ కారణమై ఉంటాడని వర్షిత తల్లి ఫిర్యాదులో పేర్కొన్నట్లు వివరించారు.

కార్లు అద్దెకు తీసుకెళ్లి అపహరణ

జడ్చర్ల: అద్దెకు తీసుకెళ్లిన కార్లు అపహరించిన నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రమోహన్‌రావు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక సంతోష్‌నగర్‌కాలనీకి చెందిన దేశ్‌ముఖ్ మహేష్‌రావుకు గద్వాలకు చెందిన హేమాకర్, రాహుల్‌తో పరిచయం ఉంది. దీంతో వారు మహేష్‌రావు ఫోన్ చేసి 15రోజుల పాటు కారు అద్దెకు కావాలని కోరారు. దీంతో దేశ్‌ముఖ్ మహేష్‌రావు వద్ద కార్లు లేకపోవడంతో తన స్నేహితుడు మోహన్‌కు చెందిన కారును అద్దెకు పంపించాడు. తర్వాత ఇదే క్రమంలో మరో రెండు కార్లను అద్దెకు మాట్లాడి పంపించాడు. అద్దె ఇవ్వకపోగా మహేష్‌రావు ఫోన్ చేస్తే హేమాకర్, రాహుల్ స్పందించడం లేదు. కార్లు కూడా అప్పగించడం లేదని బాధితుడి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వికసించిన బ్రహ్మకమలం



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని సర్దార్ వల్లబ్‌భాయిపటేల్ నగర్‌లో నివాసం ఉంటున్న మానె సుజాత గృహంలో బుధవారం రాత్రి బ్రహ్మకమలం వికసించింది. మొక్క వద్ద కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. కాలనీ వాసులు పెద్దసంఖ్యలో పుష్పాన్ని ఆసక్తిగా తిలకిస్తున్నారు.

బీసీలను విస్మరించిన ప్రభుత్వం

జడ్చర్ల టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీలకు కేవలం రూ.2,200కోట్లు మాత్రమే కేటాయించిందని.. పూర్తిగా విస్మరించిందని బీసీసేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ ఆరోపించారు. బుధవారం పట్టణంలోని బీసీ సేన కార్యాలయంలో నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దేశంలో ఉన్న 70 కోట్లమంది బీసీలకు ఒక్కపూట భోజనానికి కూడా సరిపోదని ఎద్దేవా చేశారు. ఒక ప్రణాళిక ప్రకారమే బీజేపీ బీసీలను విస్మరిస్తోందన్నారు. కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ మిత్రపక్షాలతో కలిసి చట్టసభల్లో రిజర్వేషన్లు, బీసీ కులగణన, కేంద్రంలో బీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. మాచారం శ్రీనివాస్, మురళీ, వెంకటేష్, రాములు, ఆంజనేయులు, రమణ, నాగరాజు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



జూరాల వద్ద అదే జోరు

- ప్రాజెక్టుకు 1.80లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 43 క్రస్టు గేట్ల ఎత్తివేత



జూరాల ప్రాజెక్టు రిజర్వాయర్‌లో ప్రస్తుత నీటి మట్టం

ధరూరు: మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు భారీ వరద జోరు కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. బుధవారం ప్రాజెక్టుకు 1.80లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. దీంతో ప్రాజెక్టు 43 క్రస్టు గేట్లను ఎత్తి 1,57,122 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు చెప్పారు. ఆవిరి రూపంలో 42, కుడి కాల్వ ద్వారా 584, ఎడమ కాల్వకు 920, నెట్టెంపాడుకు 1,500, భీమా లిఫ్టు-1కు 1,300 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు వైపు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో 6.157 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇదిలా ఉండగా ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరిగినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు 1,78,528 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని, ప్రాజెక్టు నుంచి 2లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 123.081 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 91.263 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు సైతం ఇన్‌ఫ్లో పెరిగినట్లు అధికారులు చెప్పారు. ప్రాజెక్టుకు 2.25లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు వద్ద 25 గేట్లను ఎత్తి 2.30లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 33.313 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 27.927 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

43.852 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తి కొనసాగుతుంది. బుధవారం 11 యూనిట్లలో ఉత్పత్తి చేపట్టినట్లు జెన్‌కో ఎస్‌ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ అన్నారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగా వాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 43.852 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని తెలిపారు.

నిండుకుండలా రామన్‌పాడు

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో బుధవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 827 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. ఎన్‌టీఆర్ కాల్వ ద్వారా 800 క్యూసెక్కులు తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

శ్రీశైలంకు నీటి ప్రవాహం

దోమలపెంట: జూరాల నుంచి దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టుకు నీటి ప్రవాహం కొనసాగుతుంది. బుధవారం 1,81,810 క్యూసెక్కుల నీటి ప్రవాహం వచ్చింది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 850.2 అడుగుల నీటి మట్టం, 80.54 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 1,600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోశారు. భూగర్భ కేంద్రంలో 3.126 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 6,474 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న నాగార్జున సాగర్‌కు వదులుతున్నారు. జలాశయంలో 72 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.



సోమశిలలో పుష్కరఘాట్ల వద్దకు చేరుకున్న నీరు



వలలను ఒడ్డుకు చేర్చి సరిచూసుకుంటున్న మత్స్యకారులు

పుష్కరఘాట్లకు చేరిన కృష్ణానది నీరు

కొల్లాపూర్: కృష్ణానదికి మంగళవారం రాత్రి నుంచి వరద ప్రవాహం తగ్గింది. సోమశిల సమీపంలోని పుష్కరఘాట్ల వద్దకు నది నీటిమట్టం చేరుకుంది. సోమశిలలోని దర్గా చుట్టూ నీళ్లు చేరుకున్నాయి. నంద్యాల జిల్లా భూభాగంలోని సంగమేశ్వర ఆలయం గోపురం వరకు నీళ్లు చేరాయి. వరద ప్రవాహం తక్కువగా ఉండడంతో గోపుర భాగం ఇంకా తేలుకొని ఉంది. నది నీటి ప్రవాహాన్ని తిలకించేందుకు పర్యాటకులు సోమశిల, అమరగిరి, మంచాలకట్ట పరిసర ప్రాంతాలకు విచ్చేస్తున్నారు.

సూపరింటెండెంట్ కేటాయింపుపై నేడు స్పష్టత

- ముగ్గురు సీనియర్ల పేర్లు ప్రతిపాదన

పాలమూరు: మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా ఎవరిని నియమించనున్నారు? అనే అంశంపై గురువారం సాయంత్రం వరకు స్పష్టం రానుంది. ఇప్పటికే ప్రస్తుత సూపరింటెండెంట్ జీవన్‌ను ఉస్మానియాకు బదిలీ చేయగా ఆయన ఈనెల 6న బాధ్యతలు తీసుకున్నారు. ఆ సీటు ఖాళీ కావడంతో ఎవరూ వస్తారనేది ఆసక్తిగా మారింది. దీనికి తోడు రెండు రోజుల పాటు సూపరింటెండెంట్ పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఆస్పత్రి వ్యవస్థ అస్తవ్యస్థం అయ్యింది. వైద్యులతో పాటు పరిపాలన సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. ఇప్పటికే సూపరింటెండెంట్‌గా నియామకం కోసం ఆస్పత్రిలో ఉన్న మూడు విభాగాల నుంచి ముగ్గురు సీనియర్ల పేర్లు డీఎంఈకి ప్రతిపాదనలు పంపారు. ఇటీవల జరిగిన బదిలీల్లో మెడికల్ కళాశాల పరిధిలో మొత్తం 15మంది బదిలీపై వెళ్లాగా, వారి స్థానంలో మరో 8మంది గురువారం విధుల్లో చేరే అవకాశం ఉంది. రేడియాలజీ ప్రొ.హన్మంతు ప్రసాద్, పిడియాట్రిక్ ప్రొఫెసర్ సురేష్, ఈఎన్‌టీ సంపత్‌కుమార్ సింగ్‌లతో పాటు మరి కొందరి పేర్లతో జాబితాను పంపినట్లు మెడికల్ కళాశాల డైరెక్టర్ రమేష్ వెల్లడించారు.

హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

తెలకపల్లి: హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు విధించినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు. మండలంలోని గడ్డంపల్లికి చెందిన గాల్‌రెడ్డి ఆయన భార్య ఇందిరమ్మ, కూతురు హరిత కలిసి 2014, ఆగస్టు 15న దాయాదులు అయిన పద్మమ్మను హత్య చేశారు. విచారణ అనంతరం బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా జడ్జి రాజేష్‌బాబు గాల్‌రెడ్డి, ఇందిరమ్మ, హరితను నిందితులుగా నిర్ధారిస్తూ గాల్‌రెడ్డికి 15 వేలు, ఇందిరమ్మకు, హరితకు చెరో రూ.5వేల చొప్పున జరిమానా విధించారు. ముగ్గురికి జీవిత ఖైదు విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇద్దరికి రిమాండ్

లింగాల: పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన మండలంలోని అవుసలికుంటకు చెందిన వ్యక్తిని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. వ్యక్తిపై కేసు నమోదు కాగా కోర్టుకు హాజరు కాలేదని ఎస్‌ఐ తెలిపారు. జడ్జి అతని మీద వారెంట్ జారీ చేయగా నాగర్‌కర్నూల్ కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారని ఎస్‌ఐ తెలిపారు. మండల కేంద్రంలో ఈ నెల 11వ తేదీన చోరీ కేసులో ధనుంజయుడిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

లింగాల: మండల కేంద్రంలోని ఓ వ్యక్తి ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో బుధవారం ఆకస్మిక దాడి చేసినట్లు ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. ఏడుగురిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. వారి నుంచి రూ.8,050 నగదును, ఐదు సెల్‌ఫోన్లను సీజ్ చేశామన్నారు.

మహిళను కాపాడిన పోలీసులు



ఎర్రవల్లిచౌరస్తా: కుటుంబ కలహాలతో ఓ వివాహిత జీవితంపై విరక్తి చెంది బుధవారం కృష్ణానదిలో దూకగా స్థానికంగా విధులు నిర్వహిస్తున్న పోలీసులు ఆమెను కాపాడారు. ఎస్‌ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లాలోని చెన్నారంకు చెందిన ఓ వివాహిత కుటుంబంలో నిత్యం తగాదాలు జరుగుతుండటంతో జీవితంపై విరక్తి చెంది బీచుపల్లికి వచ్చి కృష్ణానది పుష్కరఘాట్ దగ్గర నదిలోకి దూకింది. ఈ క్రమంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఇటిక్యాల బ్లూకోర్ట్ పోలీసులు గమనించి చాకచక్యంగా వ్యవహరించి మహిళ ప్రాణాలను కాపాడారు. అనంతరం ఆమె పూర్తి వివరాలను తెలుసుకొని కౌన్సెలింగ్ చేసి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

దేశానికి మంచి క్రీడాకారులను అందిస్తాం



స్పోర్ట్స్ అథారటీ చైర్మన్ శివసేనారెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తదితరులు

- రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

వనపర్తి: రాష్ట్రం నుంచి దేశానికి క్రీడాకారులను అందించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి ఆయన బుధవారం సొంత గ్రామం పెద్దగూడెంకు చేరుకుని అక్కడి నుంచి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డితో కలిసి ర్యాలీగా వనపర్తికి చేరుకున్నారు. పట్టణంలో భారీ మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సన్మానసభ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. క్రీడాభివృద్ధిలో సొంత జిల్లాకు తొలి ప్రాధాన్యం ఉంటుందని, క్రీడలకు పుట్టినిల్లుగా పేరొందిన వనపర్తి క్రీడాకారుల ప్రతిభను దేశావ్యాప్తంగా తెలియజేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. గత ప్రభుత్వాల్లో కంటే ఎక్కువగా సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో యువతలో క్రీడాస్ఫూర్తిని పెంచేందుకు పెద్ద ఎత్తున నిధులు విడుదల చేసినట్లు వెల్లడించారు. సీఎం సహకారంతో రాష్ట్రంలో అన్ని క్రీడలను అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్రంలోని ఏకైక హాకీ అకాడమీ వనపర్తిలో కొంతకాలంగా కొనసాగుతుందని, గత ప్రభుత్వంలో నిధుల కొరతతో నిర్వహణ అధ్వానంగా మారినట్లు తెలిసిందని, ఇకపై ఇబ్బందులు లేకుండా కావాల్సిన వసతులు, నిధులను సమకూర్చేలా అధికారులను ఇదివరకే ఆదేశించామన్నారు. క్రీడాభివృద్ధి కోసం రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో 50 ఎకరాల భూమిని కేటాయించేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు తీసుకువెళ్తామని, క్రీడల్లో రాష్ట్రాన్ని దేశంలోనే ప్రథమస్థానంలో నిలుపుతామన్నారు.

జిల్లాకు స్పోర్ట్స్ స్కూల్

వనపర్తి జిల్లాలో మూడో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని, ఇప్పటి వరకు రాష్ట్రంలో కేవలం రెండు స్పోర్ట్స్ స్కూల్స్ మాత్రమే ఉన్నాయని తెలిపారు. జాతీయస్థాయిలో సత్తాచాటిన హాకీ క్రీడాకారులకు వనపర్తి జిల్లా పుట్టినిల్లని, పదేళ్లుగా ఈ ప్రాంత క్రీడాకారులు ఎన్నిసార్లు నివేదించిన టర్ఫ్ హాకీ గ్రౌండ్ ఏర్పాటు కాలేదని తెలిసిందని, త్వరలో జిల్లా కేంద్రంలో టర్ఫ్ హాకీ గ్రౌండ్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీనిచ్చారు.

బీజేపీ ఎంపీలు ధర్నాకు కలిసిరావాలి: ఎమ్మెల్యే

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన బీజేపీ ప్రభుత్వంపై పోరాడేందుకు స్థానిక బీజేపీ ఎంపీలు తమతో కలిసి రావాలని ఎమ్మెల్యే తూడిమేఘారెడ్డి పిలుపునిచ్చారు. పార్లమెంట్‌కు తెలంగాణ ప్రజలు 8మంది ఎంపీలను స్థానాలను బీజేపీకి కట్టబెట్టినా, రాష్ట్రంపై చిన్నచూపు తగదన్నారు. మీ ఢిల్లీ పెద్దలను ఒప్పించి రాష్ట్రానికి నిధులు తీసుకురావాలని లేదంటే, అక్కడే జంతర్‌మంతర్ వద్ద నిరసన చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ చెర్మన్ మహేష్, వైస్ చైర్మన్ కృష్ణ, శంకర్ ప్రసాద్, కౌన్సిలర్లు సత్యం, బ్రహ్మం, వెంకటస్వామి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కల్లు దుకాణాలపై నార్కోటిక్ అధికారుల దాడి

మల్దకల్: మండల కేంద్రంలోని కల్లు డిపో, దుకాణాలపై బుధవారం రాష్ట్ర నార్కోటిక్, ఎక్సైజ్, పోలీసు అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. అధికారులు స్థానిక కల్లు డిపోలో తనిఖీలు నిర్వహించి నమూనాలు సేకరించారు. అక్కడే కల్లును సేవిస్తున్న వ్యక్తి నారాయణతో పాటు మరికొంత మంది నుంచి నమూనాలు సేకరించారు. అధికారుల దాడులను ముందే పసిగట్టిన కల్లు దుకాణ నిర్వాహకులు పరారయ్యారు. దుకాణాలలో ఉన్న కల్లును అధికారులు పారబోశారు. ఈ దాడులు బుధవారం ఉదయం నుంచి జరుగుతున్నప్పటికి రాత్రి 9గంటలు దాటినా అధికారుల నుంచి ఎలాంటి సమాచారం అందకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తుంది. ఈ దాడులలో రాష్ట్ర నార్కోటిక్ అధికారి రాములు నాయక్ బృందం, గద్వాల పోలీసు, ఎక్సైజ్ సీఐలు భీంకుమార్, గణపతిరెడ్డి, ఎస్‌ఐ సురేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

సీహెచ్‌సీని పరిశీలించిన కాయకల్ప బృందం



కల్వకుర్తి ఆస్పత్రిని పరిశీలిస్తున్న కాయకల్ప సభ్యులు

కల్వకుర్తిటౌన్: ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు అందించే సేవలపై కాయకల్ప బృందం పరిశీలించింది. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల బృందం ఆదయ్య, శైలజ, వైజయలక్ష్మి అన్ని విభాగాల వారీగా గదులను పరిశీలించి, రోగులకు అందించే డైట్ వివరాలను తెలుసుకున్నారు. ఆస్పత్రి ఆవరణలో ప్రకృతి సహజ సంపదను రోగులకు ఉపయోగపడేలా వినియోగించుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ శివరాంకు సూచించారు. వీలైనంతగా ప్లాస్టిక్ వాడకాన్ని ఆస్పత్రిలో తగ్గించి, ఇంకుడు గుంతలు ఏర్పాటుచేసి, బయో మెడికల్ వ్యర్థాలను చాలా జాగ్రతగా డిస్పోజ్ చేసేలా చూడాలన్నారు. ఆస్పత్రి వైద్యులు విభాగాల వారీగా కాన్పుల గది, ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, ఓపీ విభాగం, డయాలసిస్ గదులను గురించి కాయకల్ప సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ మేనేజర్ సంతోష్‌కుమార్, వైద్యులు స్వర్ణలత, యశోద, విష్ణు, అన్నపూర్ణ, పాండురంగా, షకీల్, స్వప్న, ప్రభావతి, నర్సులు తదితరులు ఉన్నారు.

దేశాన్ని నంబర్‌వన్ చేసేందుకు ప్రధాని కృషి



ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

వనపర్తిటౌన్: 2030లోపు యావత్ ప్రపంచంలోనే దేశాన్ని నంబర్ వన్‌గా నిలిపేందుకే ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వ రూ. 48.20లక్షల కోట్ల బడ్జెట్‌ను స్వాగతిస్తూ ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదలకు, రైతులు, యువత, మహిళల అభ్యున్నతి, వికసిత భారత్ లక్ష్యాలుగా తీర్చిదిద్దడానికి కావాల్సిన ఉపాధి, ఉద్యోగ, మౌలిక వసతులు, నైపుణ్యం, పారిశ్రామికీకరణ తదితర ప్రధాన అంశాలకు బడ్జెట్‌లో అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. లక్ష్యాన్ని చేరుకునేందుకు మోదీ ప్రధాన మూలధన వ్యయం కోసం ఏడాదికి రూ.11.11 లక్షల కోట్లు కేటాయించారని వివరించారు. రాష్ట్రం పరిధిలోని మౌలిక వసతులను అభివృద్ధి చేసుకోవడానికి రూ. 1.5లక్షల కోట్ల వడ్డీ రహిత రుణాలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. బడ్జెట్ అన్ని వర్గాలకు న్యాయం చేసేలా ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నారాయణ, ప్రభాకర్‌రెడ్డి, రామన్‌గౌడ్, సీతారాములు, అశ్విని రాధ, కవిత యాదవ్, శామ్యూల్, రాము, రాయన్న సాగర్, విజయ్ కుమార్, రాము, శివ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి, పాలమూరుకు ఒరిగిందేమిలేదు

- ఎంపీ డీకే అరుణ తన పదవికి రాజీనామా చేయాలి
- టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి, పాలమూరుకు ఒరిగిందేమిలేదని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి విమర్శించారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని, దీనిపై బీజేపీ మంత్రులు, నాయకులు ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ బడ్జెట్ మోదీ తన కుర్చీని కాపాడుకునే విధంగా ఉందని ఎద్దేవా చేశారు. కొత్త రాజధాని అమరావతికి రూ.10వేల కోట్లు కేటాయించి, ఉమ్మడి రాష్ట్రంలో రాజధానిగా ఉన్న హైదరాబాద్‌లోని మూసీనది ప్రక్షాళనకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1.50లక్షల కోట్ల ప్రతిపాదనలు పంపినా ఒక్క పైసా ఇవ్వలేదన్నారు. 2013లో విభజన హామీలను పొందుపరుస్తూ చట్టాలు చేసిన ఐటీఐఆర్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీపై ఈ బడ్జెట్‌లో ఊసెత్తలేదని ఆరోపించారు. నారాయణపేటకు సైనిక్ స్కూల్ తెస్తానని డీకే అరుణ చెప్పారని, దీనిపై ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోకి వచ్చే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు ఈ బడ్జెట్‌లో కనీసం రూ.కోటి కూడా ఎందుకు పెట్టించలేకపోయారని ప్రశ్నించారు. ఎంపీ డీకే అరుణ పార్లమెంట్ ఎన్నికల్లో అనేక విషయాలపై కరపత్రాల్లో మేనిఫెస్టోగా చేర్చారని ఏ ఒక్కటి సాధించలేకపోయారని అన్నారు. వెంటనే ఆమె నైతిక బాధ్యత వహించి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డీసీసీ మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, ఫహీం పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలని రైతుల ఆందోళన



వంటా వార్పుతో ఆందోళన చేస్తున్న రైతులు

గట్టు: నష్టపరిహారం చెల్లింపు వ్యవహారంపై తప్పెట్లమొర్సు రైతులు ఆందోళనను రెండవ రోజు బుధవారం కొనసాగించారు. భారత్‌మాల జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్న చోట రైతులు వంటావార్పుతో నిరసన కొనసాగించారు. రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు భూములతో పాటుగా పండ్ల తోటలు, ఇతర నిర్మాణాలకు తక్కువ పరిహారం చెల్లిస్తున్నట్లు రైతులు ఆరోపించారు. రెండో విడత నష్ట పరిహారం చెల్లింపులో జరుగుతున్న ఆలస్యంపై రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ భూముల్లోని బోర్లు, నిర్మాణాలకు సరైన నష్ట పరిహారం చెల్లించడం లేదన్నారు. అధికారులు మాత్రం ఆందోళనను పట్టించుకోకుండా పనులను కొనసాగిస్తున్నారని, రోడ్డు పనులు పూర్తయితే తమను ఎవరూ పట్టించుకుంటామని వాపోయారు.

భూ వివాదాలను పరిష్కరించండి



మాట్లాడుతున్న అధ్యక్షుడు అడమ్స్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రాష్ట్రంలోని భూ వివాదాలను వెంటనే పరిష్కరించేందుకు కార్యాచరణ రూపొందించాలని కన్స్యూమర్ అవేర్‌నెస్ ప్రొటెక్షన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అడమ్స్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ, వ్యవసాయేతర, గట్టు హద్దులు, తప్పు సర్వే నంబర్లు ఇతర సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలన్నారు. వీటి పరిష్కారం కోసం తరుచూ స్థానికంగా ఘర్షణలు అవుతున్నాయని తెలిపారు. సర్వే ల్యాండ్ రికార్డు అధికారుల పనితీరు అవినీతిమయమై ఆగమ్యగోచరంగా ఉందని దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెవెన్యూ సదస్సుల మాదిరిగా భూమి హద్దుల సమస్యలు పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో విజయ్‌మోహన్‌గౌడ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

అచ్చంపేట రూరల్: తాళం వేసిన ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బంగారు ఆభరణాలు, నగదును ఎత్తుకెళ్లిన ఘటన పట్టణంలోని వెంకటేశ్వరనగర్ కాలనీలో చోటు చేసుకుంది. కాలనీకి చెందిన చంద్రమౌళి ఈనెల 19న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి తమ బంధువుల వద్దకు హైదరాబాద్ వెళ్లారు. తిరిగి ఈనెల 23న ఇంటి వద్దకు రాగా, ఇంటి తాళం విరగ్గొటి ఉండటం గమనించారు. ఇంట్లో ఉన్న బీరువాను పగులగొట్టి తులం బంగారు, నగదును దొంగలు తీసుకెళ్లినట్లు గుర్తించి బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో చంద్రమౌళి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా రాత్రివేళలో పోలీసుల గస్తీ అంతంతమాత్రంగానే ఉంటుందని స్థానికులు చర్చించుకుంటున్నారు.